సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



రిమ్స్ 'ఫార్మసీ'లో అస్తవ్యస్తం!

కడప రిమ్స్ ఫార్మసీ విభాగంలో కొందరు సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. మందుల సరఫరాలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. -10లో



విజేతలుగా వెస్ట్ గోదావరి జట్లు

ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌లుగా పశ్చిమగోదావరి జట్లు నిలిచాయి. సోమవారం కడపలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లు హోరా హోరీగా సాగాయి. -10లో

గరిష్టం/కనిష్టం
35.7/24.1

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.1 – 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

రెక్కలు తొడిగి..రెపరెపలాడి..

- కడప ఎయిర్‌పోర్టుకు మహర్దశ
- రూ. 224.05 కోట్లతో న్యూ టెర్మినల్ భవన నిర్మాణం
- మూడు ఏరో బ్రిడ్జిలు ఏర్పాటు
- నైట్ ల్యాండింగ్ పనులు పూర్తి



ఎయిర్‌పోర్టు న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవనం నమూనా

కడప సిటీ : కడప విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రూ. 224.05 కోట్లతో న్యూ డొమెస్టిక్ బిల్డింగ్ నిర్మాణం, ఇతర పనులకు శ్రీకారం చుట్టేందుకు టెండర్లను కూడా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పిలిచింది. మరో మూడు నెలల్లో టెండర్లు పూర్తయి రెండేళ్ల కాలంలో అంటే మార్చి 2026కు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.ఇప్పటికే నైట్ ల్యాండింగ్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దనున్నారు.

రూ. 224.05 కోట్లతో పనులు

ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ. 224.05 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో 12,900 చదరపు మీటర్లలో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవన నిర్మాణాన్ని అత్యాధునిక సౌకర్యాలతో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్లను పిలిచారు. తిరుపతి, విజయవాడ, రాజమండ్రి తరహాలో ఈ ఎయిర్‌పోర్టును సర్వాంగ సుందరంగా మార్చను న్నారు. మూడు ఏరో బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇవి పూర్తయితే టెర్మినల్ భవనం నుంచి నేరుగా విమానంలోకి చేరుకునే అవకాశం ఉంటుంది. వర్షం వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులు విమానం వద్దకు చేరుకోవచ్చు. ప్రస్తుతం బస్సు ద్వారా అక్కడికి చేరుకుంటారు.

పెద్ద విమానాలు వచ్చేందుకు అవకాశం

కడప విమానాశ్రయంలో పెద్ద విమానాలు రాకపోకలు సాగించేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నైట్ ల్యాండింగ్‌కు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అనుమతి వచ్చిన తర్వాత పనులన్నీ పూర్తయ్యాయి. రన్‌వే పెంపుతో పాటు రన్‌వే లైటింగ్, అప్రోచ్ లైటింగ్, పార్కింగ్ బే లైటింగ్, 2.5 కిలోమీటర్ల రన్‌వే, సెక్యూరిటీ, పెరిమీటర్ లైటింగ్, పెరిమీటరు రోడ్డు తదితర పనులు పూర్తయ్యాయి. దీంతో నైట్ ల్యాండింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా విమానాలు దిగేందుకు అవకాశం ఉంటుంది.

అత్యాధునిక సౌకర్యాలు

కడప విమానాశ్రయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి నిధులు విడుదల కావడంతో పనులు త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఆ దిశగా ఇక్కడి అధికారులు అడుగులు వేస్తున్నారు. ఎస్కలేటర్, అధునాతనమైన లిఫ్ట్, సెంట్రలైజ్డ్ ఏసీ, బ్యాగేజీ కన్వేయర్ బెల్ట్, మూడు ఏరో బ్రిడ్జిలు, టెర్మినల్ భవనం, ఇతరత్రా పనులను చేపట్టనున్నారు. అంతేకాకుండా న్యూ కారు పార్కింగ్, అప్రోచ్‌రోడ్లు, బ్యూటిఫికేషన్ పనులు కూడా చేపట్టనున్నారు.



ఏర్పాటు కానున్న ఏరో బ్రిడ్జి

కొత్త టెర్మినల్‌లో 700 మంది ప్రయాణికుల సౌకర్యం

ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనంలో 40+40 (80) మందికి మాత్రమే అవకాశం ఉంది. కొత్త టెర్మినల్ పూర్తయితే మొత్తం 700 మందికి రాకపోకలు సాగించే అవకాశాలు ఉంటాయి. ఏడు విమానాలు పార్కింగ్ చేసేందుకు ఇక్కడ అవకాశం ఉంది. అభివృద్ధి పనులు పూర్తయితే ఏ–320 (180మంది) ప్రయాణికులు ప్రయాణించే పెద్ద విమానాలు ఇక్కడి నుంచి నడిపేందుకు వీలు ఉంటుంది.



పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

కడప విమానాశ్రయంలో పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా కూడా పైలెట్ శిక్షణా కేంద్రం లేదు. ప్రప్రథమంగా కడప విమానాశ్రయంలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చేనెల 25, 26 తేదీల్లో ఇందుకు సంబంధించి ప్రణాళిక ఖరారు కానుంది. తర్వాత ఈ శిక్షణా కేంద్రం పనులు చేపట్టే అవకాశం ఉంది.



విమానాశ్రయ అభివృద్ధికి కృషి



కడప విమానాశ్రయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ధన్యవాదాలు. ప్రస్తుతం నైట్ ల్యాండింగ్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. త్వరలో రూ. 224.05 కోట్లతో న్యూ డొమెస్టిక్ టెర్మిరల్ భవనం, ఇతర పనులను చేపట్టనున్నాము. విమానాశ్రయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం. అధునాతన సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం.

– సుజిత్‌కుమార్ పొద్దర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, కడప

న్యూస్‌రీల్

నిరుద్యోగ మహిళలకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెటీ డైరెక్టర్ ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌కు గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు 30 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారై ఉండాలన్నారు. వివరాలకు 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

18న రాష్ట్ర స్థాయి సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కృష్ణానది జలాల పునః పంపిణీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 18న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర సోమవారం పేర్కొన్నారు. కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగే సదస్సులో కృష్ణా జలాల పంపిణీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర నాయకులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంఎ గఫూర్, నీటిపారుదల రంగం నిపుణులు బొజ్జ దశరథరామిరెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు ముప్పాల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు జి ఈశ్వరయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు.

21న కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగ సందర్భంగా కడప మీదుగా తిరుపతి–సికింద్రాబాద్–తిరుపతి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. ఈనెల 21వ తేదీ శనివారం రాత్రి 10.05 గంటలకు సికింద్రాబాదులో బయలుదేరి తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 4.35 గంటలకు తిరుపతిలో బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.50 గంటలకు సికింద్రాబాదుకు చేరుతుందన్నారు.

పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చదువుతున్న ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించిందని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఆన్ క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఎవరైనా ఆన్‌లైన్ తరగతులు,ఆన్‌లైన్ పరీక్షలు కానీ నిర్వహిస్తే తల్లితండ్రులు తమ దృష్టికి లేదా ఆంధ్రప్రదేశ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిషనర్ కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్ 1902, 08632444270, 7702979797 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. apscpcr2018@gmail.com దృష్టికి తీసుకురావాలని డీఈఓ తెలిపారు.


నూతన నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న యమునారెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా ఓసీ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన ఏమిరెడ్డి యమునారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకటసుబ్బారెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని అందచేశారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారిగా..



సీవీ జయలక్ష్మి

ప్రొద్దుటూరు: బీజేపీ ఆంధ్రప్రదేశ్ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారిగా పట్టణానికి చెందిన సీవీ జయలక్ష్మిని పార్టీ అధిష్టానం నియమించింది.

కీలక నిర్ణయాలకు ఆమోదం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అకడమిక్ సెనెట్ స్టాడింగ్ కమిటీ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సోమవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నోటిఫికేషన్ జారీకానున్న నేపథ్యంలో పోస్టుల రోస్టర్, స్పెషలైజేషన్, పోస్టులకు కావాల్సిన అర్హతలు చర్చించి సెనెట్ అనుమతితో ఆమోదం తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి దూరవిద్య కోర్సులు అమలు చేసేందుకు ఆమోదించింది. అలాగే ఎంబీఏ, ఎంసీఏల నిర్వహణకు ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అకడమిక్ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నూతన విద్యాసంవత్సరం కోర్సులు, సిలబస్ అమలు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాల అమలుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్'కాన్ఫరెన్స్‌హాల్‌లో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ జిల్లా ఎస్పీ సూచించారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సైబర్‌క్రైమ్. జీఓవి. ఇన్ ద్వారా 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'(ఎన్‌సీఆర్‌పి)లో, టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ప్రణాళికతోనే పదిలో ఉత్తమ ఫలితాలు





మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి, సమావేశానికి హాజరైన మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్

కడప ఎడ్యుకేషన్: పదో తరగతిలో ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప సీఎస్ఐ స్కూల్‌లోని డీసీఈబీ హాలులో జోన్–4 పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించిన మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు 2023–24 పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇటీవలే 116 మంది టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి కల్పించామన్నారు. వీరంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో సహోపాధ్యాయులతో కలిసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా సమన్వయంతో కృషి చేయాలన్నారు. సబ్జెక్టు వారీగా ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు టైం టేబుల్ ఇవ్వాలని, దీనిని పాలించే విధంగా ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని సూచించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గణేష్‌కుమార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమం, మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం'అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు యదుభూషణ్‌రెడ్డి, శ్రీలక్ష్మీ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జేడీ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎల్‌డీఎం దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ పనులను పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, రెవెన్యూ డివిజన్ల అధికారులతో కలిసి హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం, వైద్యం, విద్య, మహిళా శిశు అభివృద్ధి శాఖలలో పురోగతి, ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, నాడు–నేడు పనుల పురోగతిపై జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ళు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే మొదటి దశలో పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేశారన్నారు. ఇదేస్ఫూర్తితో మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో పోలింగ్ స్టేషన్ల వారీగా సమస్యలను పరిష్కరించాలని, ఏసమయంలో అయినా ఎన్నికల నిర్వహించేలా పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల సదుపాయాలను సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్ర ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా ఉదయాన్నే హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి కావించారు. పవిత్ర ఉత్సవాలు ఎటువంటి విఘాతం లేకుండా ముగిసినందున వరుణదేవుడ్ని ఆహ్వానిస్తూ పవిత్ర జలాలతో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వాహనంలో స్వామివారు కొలువుదీరి గ్రామ పురమాడవీధుల్లో మేళతాళాలతో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

హెల్త్ ఇండికేటర్స్ సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హెల్త్ ఇండికేటర్స్ గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి సేకరించి గ్రామ సచివాలయ సెక్రటరీల ద్వారా ఆన్‌లైన్‌లో చేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లకు స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) జిల్లాలో 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే ఆరోగ్య సేవల వివరాలను 2022–23 సంవత్సరానికిగాను హెల్త్ ఇండికేటర్స్ డేటాను సిద్ధం చేసి గ్రామ సచివాలయాల్లోనే ఆన్‌లైన్ చేయాలని కోరారు. అనంతరం పీసీపీఎన్‌డీటీ చట్టంపై రమణమ్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ హరనాథ్, ఏఎస్ఓ జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ..భాగ్యప్రదాయిని



పొద్దుటూరు: భవానీదేవిగా కన్యకాపరమేశ్వరి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం జిల్లాలోని పలు ఆలయాలు సందడింగా మారాయి.అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరు అమ్మవారిశాలలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవిని శ్రీభవానీదేవిగా అలంకరించారు.. సింహవాహనంపై కొలువుదీరి ఆయుధాలు చేతపట్టి అభయ హస్తంతో ఉన్న అమ్మవారి భక్తులు దర్శించుకుని తరించారు. మునులు, దేవతామూర్తుల సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది.

-ప్రొద్దుటూరు కల్చరల్

ఆరోగ్యసురక్ష..అందరికీ రక్ష

కడప కోటిరెడ్డిసర్కిల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది. శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. నిపుణులైన వైద్యులు అనారోగ్య బాధితులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. అనారోగ్య పరిస్థితిని గుర్తించి ఉత్తమ వైద్యసేవలకుగాను పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. సోమవారం జిల్లాలోని 21 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. కడప నగరం ఎన్జీఓ కాలనీలో డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, మైదుకూరులోని విశ్వనాథపురం, ఖాజీపేట మండలంలోని కొత్తపేటలోజరిగిన శిబిరాల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలం వరికుంట్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, కమలాపురం మండల పరిధిలోని కోగటంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాలెం మండలం పార్లపాడు శిబిరంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పాల్గొని వైద్యులకు ప సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


రామాంజనేయరెడ్డి మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి (30) అనే యువకుడు సోమవారం తెల్లవారు జామున అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాంజనేయరెడ్డి తనకున్న రెండు ఎకరాల భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనులు లేనప్పుడు బేల్దారి పనులకు వెళ్లేవాడు. కాగా గత కొంత కాలం నుంచి అప్పులు ఎక్కువయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో ఆందోళన చెందేవాడు. దీంతో సోమవారం తెల్లవారుజామున విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ధర్మాపురం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరి పైరుకు గడ్డి మందు పిచికారీ చేశారని ఫిర్యాదు


ఎండిపోయిన వరిపైరు

చాపాడు : మండల పరిధిలోని బద్రిపల్లె పొలంలో సర్వే నెంబరు 218/2లో 23 సెంట్లలో సాగులో ఉన్న వరి పైరుకు వీరంరెడ్డి మస్తాన్‌రెడ్డి అనే వ్యక్తి గడ్డి మందు పిచికారీ చేయగా పైరు పూర్తిగా దెబ్బతిని ఎండిపోయిందని సోమాపురానికి చెందిన బాధిత రైతులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, కొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల రీ సర్వేలో భాగంగా తమ పొలం 23 సెంట్లు మస్తాన్‌రెడ్డి పొలంలో ఉండటంతో రెవన్యూ అధికారులు కొలతలు వేసి హద్దులు రాళ్లు పాతించారన్నారు. వరి సాగు చేసి పంట చేతికందే క్రమంలో మస్తాన్‌రెడ్డి దౌర్జన్యంగా పైరుకు గడ్డి మందు పిచికారీ చేశాడని బాధితులు ఎస్‌ఐ మైనుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు.

ఎస్ఈబీ కార్యాలయం తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

కడప వైఎస్సార్ సర్కిల్ : కడపలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయాన్ని సోమవారం ఆ శాఖ అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, స్టేషన్ సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. దసరా పండుగ సందర్భంగా స్టేషన్ పరిధిలోని నాటుసారా ప్రభావిత గ్రామాలలో ప్రత్యేక దాడులు నిర్వహించాలని సూచించారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల మద్యం, ఇసుక అక్రమ రవాణా, గంజాయి వంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే సీకే దిన్నె మండలం మద్దిమడుగు తాండాలో నాటుసారాకు సంబంధించిన పాత ముద్దాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

10 మంది బైండోవర్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరుగురు రౌడీషీటర్లు, నలుగురు అనుమానిత షీట్లు కలిగిన వారికి మొత్తం 10 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ పి. రాజా తెలిపారు. ఈ జాబితాలో ఉన్నవారు భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రిమ్స్ ఫార్మసీలో అస్తవ్యస్తం!

- సమయపాలన పాటించని కొందరు సిబ్బంది
- ప్రతిష్టాత్మకమైన 'ఈ – ఔషధీ', 'ఈ – హాస్పిటల్' ఎంట్రీలలో నిర్లక్ష్యం
- మందుల సరఫరా, వినియోగంలో అవకతవకలు


కడప రిమ్స్ ఓపీలో ఫార్మసీ విభాగం

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు సంబంధించి మందులను, వారికి కావాల్సిన ఇంజక్షన్‌లను సైతం సరఫరా చేయాల్సిన విభాగం 'ఫార్మసీ'. ఈ విభాగం సర్వజన ఆసుపత్రి ఐపీ, ఓపీ విభాగాలకు చాలా కీలకమైన విభాగం. ఈ విభాగంలో మొత్తం 22 మంది ఫార్మసిస్ట్ గ్రేడ్–2లు, గ్రేడ్–1లు ఇద్దరు, ఒక సూపర్‌వైజర్ విధులను నిర్వహిస్తున్నారు. వీరందరిలో కొందరు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి ఉదయం వరకు జనరల్ షిఫ్ట్‌లో కొందరు విధులను నిర్వహించాల్సి ఉంది. వీరిలో కొందరు సమయపాలన పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీరు విధులకు హాజరు కాగానే మందులను ఇవ్వడం, ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్య సేవలను పొందిన వారి వివరాలను 'ఈ– ఔషధీ', ఈనెల నుంచి 'ఈ– హాస్పిటల్'లలో విధిగా నమోదు చేయాల్సి ఉంది.

- కానీ సర్వర్ సమస్య ఉందని, ఇతర కారణాలను చూపి ఆయా వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- ఐపీ, ఓపీ విభాగాలలో మందుల సరఫరా వివరాలను నమోదు, పంపిణీలో కూడా కొన్ని అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- కాలం చెల్లిన మందులు అనే అంశం దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అక్కడి అధికారులు, సిబ్బందిపైన ఎంతో ఉంది. కానీ కరోనా సమయంలో ఎంతో అత్యవసరంగా ఉపయోగించిన డ్రగ్స్ 'రెమ్‌డెసీవర్'లు ఎక్కువ సంఖ్యలో కాలం చెల్లిపోయినా, వాటిని అలాగే భద్రంగా దాచుకుని ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఇంకా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు ఈ విషయంపై సమగ్రంగా విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.
- ఇంకా వార్డులకు సరఫరా చేసే మందుల విషయంలో వందల సంఖ్యలో తేడాలను గమనించవచ్చు. అలాగే కొన్ని మందుల కాలపరిమితి నెలలోపు ఉన్నా వాటిని సరఫరా చేస్తున్నారు. మాస్కులను సరఫరా చేస్తున్న వ్యవహారం కూడా మందకొడిగా సాగుతోంది. ఇక్కడి రిజిస్టర్‌లను, బిల్లులను, వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్జికల్, మెడికల్ విభాగాలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్, లోకల్‌గా కొనుగోలు చేస్తున్న మందులు, పరికరాల వ్యవహారంపై కూడా అధికారులు నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతిరోజు ఇక్కడికి వేల సంఖ్యలో ప్రజలు మందుల కోసం వస్తుంటారు. వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి. మందుల సరఫరా, సద్వినియోగం అయ్యేంతంగా చూసుకోవాల్సిన బాధ్యత ఫార్మసీ విభాగం, పర్యవేక్షణ అధికారులపైనా ఉంది. అక్కడికి వచ్చే రోగులపట్ల కొందరు సిబ్బంది కటువుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫార్మసీ విద్యార్థులతో పనులు చేయించుకుంటున్న సిబ్బందిలో కొందరు మాత్రం తమ సెల్‌ఫోన్‌లలో నిమగ్నం కావడం, లేదంటే రిలాక్స్‌గా ఆసుపత్రి అంతా బలాదూర్ తిరగడం షరా మామూలై పోయింది.

ఫార్మసీ విభాగంలో సమగ్రంగా విచారణ చేస్తాం

కడప రిమ్స్ ఫార్మసీ విభాగంలో ఇటీవల కడప నగరపాలక కమిషనర్ అడ్మినిస్ట్రేటర్ హోదాలో వచ్చి తనిఖీలు నిర్వహించారు. సమయపాలన, కాలం చెల్లిన మందుల వ్యవహారాన్ని పరిశీలిస్తాం. ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ రమాదేవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్),కడప

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


రాజుపాలెంలో సీజ్ చేసిన ఎరువుల వద్ద విజిలెన్స్ అధికారులు

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఇందులో భాగంగా శ్రీకృషి ఆగ్రో సీడ్స్ పురుగు మందుల దుకాణంలో అధికారులు తనిఖీ చేయగా డీఏపీ ఎరువును ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్ముతుండటంతో రూ.17,550 విలువైన డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకుని మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డికి అప్పగించారు. సంబంధిత డీలర్‌పై 6 (ఏ) కింద కేసు నమోదు చేయమని ఆశాఖ అధికారులు సూచించారు. అలాగే శ్రీ మణ్యం ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణంలో ఎరువులకు సంబంధించి రికార్డులను సక్రమంగా నమోదు చేయనందు వలన రూ.3,57,210 విలువైన ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నోటీసులను సంబంధిత దుకాణ యజమానికి విజిలెన్స్ అధికారులు అందించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ సీఐ టి.రెడ్డప్ప, విజిలెన్స్ వ్యవసాయాధికారి బాల గంగాధర రెడ్డి, ఏఈఈ అశోక్ కుమార్, మండల వ్యవసాయాధికారి శివ రామ కృష్ణారెడ్డి, విజిలెన్స్ పోలీసులు జనార్దన రావు, సుదర్శన్ రెడ్డి, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

విజేతలుగా వెస్ట్ గోదావరి జట్లు


జూనియర్ బాలుర విభాగంలో విజేతలు పశ్చిమగోదావరి జట్టు


సీనియర్ మహిళల విభాగంలో విజేతలు పశ్చిమగోదావరి జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాసంబరం
- బహుమతులు అందజేసిన అతిథులు


బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంటున్న కడప క్రీడాకారిణి పల్లవి

కడప స్పోర్ట్స్ : 9వ ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌లుగా పశ్చిమగోదావరి జట్లు నిలిచాయి. గత మూడు రోజులుగా కడప నగరం వేదికగా నిర్వహించిన 9వ ఏపీ హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర విభాగం చాంపియన్‌షిప్–23 విజయవంతంగా ముగిశాయి. సోమవారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అనంతరం టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప నగర డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ సూర్యనారాయణరావు, రాజారత్నం ఐజాక్, రోడామెర్సీ, క్రీడాపోషకులు కంచి గోపీకృష్ణ, కంచి సురేంద్రనాథ్‌లు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం వేదికగా రాష్ట్రస్థాయి క్రీడాసంబరం విజయవంతంగా ముగిసిందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చక్కటి ఏర్పాట్లు చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేశారన్నారు. టోర్నమెంట్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, మెడల్స్‌ను అందజేశారు. టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన కడప క్రీడాకారిణి పల్లవికి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎ. సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటసునీల్, కోశాధికారి బాబర్, బసిరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, వివిధ జిల్లాల టెక్నికల్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

అండర్–19 బాలుర విభాగం : పశ్చిమగోదావరి (ప్రథమస్థానం), చిత్తూరు (ద్వితీయస్థానం), విజయనగరం, కర్నూలు (తృతీయస్థానం).

సీనియర్ మహిళలు : పశ్చిమగోదావరి (ప్రథమస్థానం), కృష్ణ (ద్వితీయస్థానం), కడప (తృతీయస్థానం).

ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ పోటీలు


రోడ్‌రేస్‌ను ప్రారంభిస్తున్న రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడపని డీఎస్ఏ క్రీడామైదానంలోని స్కేటింగ్ రింక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. లక్ష్మినాథ్‌రెడ్డి, కార్యదర్శి పి.ఇజ్రాయిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా అంతకు మునుపు యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రోడ్‌రేస్ కాంపిటీషన్‌ను వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు మెడల్స్ అందజేశారు. స్టెప్ సిబ్బంది నారాయణ, స్కేటింగ్ శిక్షకుడు విలియం కేరీ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో కర్నూలు జట్టు

మహేంద్రయాదవ్ డబుల్ సెంచరీ నమోదు


మహేంద్రయాదవ్, కర్నూలు (201 పరుగులు)


మనోజ్‌రాజు, కర్నూలు (146 పరుగులు)


సుబ్రమణ్యం (నెల్లూరు) 74 పరుగులు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో రెండోరోజు సోమవారం 26 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 101.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 424 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్రయాదవ్ 246 బంతుల్లో 24 ఫోర్లు, 8 సిక్సర్లతో 201 పరుగులు చేశాడు. ఈయనతో పాటు జి.మనోజ్‌రాజు 251 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 146 పరుగులు చేశాడు. అనంత బౌలర్ కమిల్ 3 వికెట్లు తీశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి కర్నూలు జట్టు 140 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. అనంత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మరో మ్యాచ్‌లో 129 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 88.4 ఓవర్లలో 347 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని సుబ్రమణ్యం 74 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దీపన్‌సాయినాథ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని పన్నీర్‌సెల్వం 59 పరుగులు, భవానీప్రసాద్ 50 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు నారాయణ 1, అఖిల్ 1, అజిత్ 1 వికెట్ తీశారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 8 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఎమ్మెల్యే రాచమల్లు గెలుపు కోసం పనిచేస్తా

- ఆయనతో ఎలాంటి విభేదాలు లేవు
- కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి


మాట్లాడుతున్న కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గెలుపు కోసం పనిచేస్తానని, ఆయనతో తనకు ఎలాంటి విభేదాలు లేవని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మేజర్ కొత్తపల్లె పంచాయతీలో 20 వార్డు మెంబర్లకు 17 వార్డుల్లో అభ్యర్థులను గెలిపించుకున్నానని తెలిపారు. ఓ అధికారి చేసిన తప్పిదాల వల్లనే ఎమ్మెల్యేకు, తనకు మనస్పర్థలు వచ్చాయన్నారు. తనకు కళాశాల రోజుల నుంచి ఆయనతో మంచి సంబంధాలు, సదభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తనకు సహకారం అందించారని తాను కూడా రెండు పర్యాయాలు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేకు శక్తివంచన లేకుండా సహకరించి మంచి మెజార్టీతో ఆయన గెలుపునకు కృషి చేశానన్నారు. పంచాయతీ సెక్రటరీ చేస్తున్న అరాచకాలను చూసి కొన్ని సందర్భాల్లో మీడియా ద్వారా తన బాధను వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తాను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలిసి పనిచేస్తానని రాబోయే ఎన్నికల్లో కొత్తపల్లె పంచాయతీ నుంచి అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేతో కలిసి కొత్తపల్లె పంచాయతీని అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తానన్నారు. సమావేశంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వల్లూరు నాగేంద్రారెడ్డి, కొనిరెడ్డి వెంకట సుబ్బారెడి, కొనిరెడ్డి వెంకట రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

సి.వి.సుబ్బారెడ్డి మృతి

– నేత్రదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం



నేత్రనిధికి కార్నియాలను అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట) వెంకటసుబ్బారెడ్డి(ఫైల్)

పులివెందుల టౌన్ : వైఎస్ కుటుంబ సమీప బంధువైన చవ్వా వెంకటసుబ్బారెడ్డి(90) సోమవారం అనారోగ్యంతో మృతి చెందా డు. ఆయన మృతి చెందిన విషయం తెలుసు కున్న వైఎస్ కుటుంబ సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, సతీమణి వైఎస్ ప్రమీలమ్మలు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరించి నేత్రదానం చేశారు. సి.వి.సుబ్బారెడ్డి సతీమణి వేదామని, కుమారుడు విజయ్‌శేఖర్‌రెడ్డి, కుమార్తె వైఎస్ ప్రమీలమ్మ, కోడళ్లు సులోచన, సు నీత, అల్లుడు వైఎస్ మనోహర్‌రెడ్డి, మన వళ్లు జగదీష్‌రెడ్డి, దుష్యంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మనవరాలు అని త, మధులిఖలు నేత్రదానానికి అంగీకరించడంతో స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు కార్నియాలను సేకరించి నేత్రనిధి కి పంపించారు. వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, పలువురు సుబ్బారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. సాయంత్రం సుబ్బారెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సేవా సమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మట్కా బీటర్లు అరెస్ట్

– రూ. 60,000 నగదు, మట్కా స్లిప్‌లు సీజ్

కడప అర్బన్ : మట్కా మహమ్మారి జోలికి ఎవరైనా వెళితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తమ సిబ్బందితో కలిసి మట్కా బీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. సోమవారం సీఐ నాగరాజు తమకు అందిన పక్కా సమాచారంతో కృష్ణ, రమేష్ థియేటర్ పరిసర ప్రాంతాల్లో మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 60,000 నగదుతో పాటు, 8 మట్కా స్లిప్‌లు, 4 బాల్‌పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, వై.వీ స్ట్రీట్‌కు చెందిన సుంకేసుల శ్రీరాములు, కుమ్మరకుంట వీధికి చెందిన పఠాన్ షఫీవుల్లా ఖాన్, రాధాకృష్ణనగర్‌కు చెందిన షేక్ మదార్‌బాషా ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు

అక్కడికక్కడే వ్యక్తి మృతి



వెంకటసుబ్బారెడ్డి మృతదేహం, ఫైల్‌ఫోటో

గోపవరం : మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్–67) ద్వారకనగర్ వద్ద బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న కత్తెరపల్లె వెంకటసుబ్బారెడ్డి (48) అక్కడికక్కడే మృతి చెందాడు. బి.కోడూరు మండలం అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా బద్వేలు పట్టణంలోని ఆంజనేయనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బద్వేలు నుంచి పి.పి.కుంట వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా హైదరాబాద్ నుంచి బద్వేలు మీదుగా నెల్లూరు దర్గాకు వెళుతున్న ఇన్నోవా కారు ముందు వెళుతున్న బైక్‌ను అతివేగంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి దాదాపు 15 అడుగుల దూరంలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను ఢీకొన్న కారు సంఘటన స్థలంలో ఆపకుండా వెళ్లిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న వ్యక్తులు పి.పి.కుంట చెక్‌పోస్టుకు సమాచారం ఇవ్వడంతో విధుల్లో ఉన్న చెక్‌పోస్టు సిబ్బంది, పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇన్నోవా కారును స్టేషన్‌కు తరలించారు. కాగా మృతునికి ఇప్పటి వరకు పిల్లలు లేకపోవడంతో అతని భార్య చెన్నైలో ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె చెన్నైలో ఉన్నారు. వెంకటసుబ్బారెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విలపించారు.

గ్రామంలో విషాద ఛాయలు

బి.కోడూరు : అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన కత్తెరపల్లె వెంకటసుబ్బారెడ్డి (48) రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మృతుని గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన అంకనగొడుగునూరు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న వెంకటసుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భర్తపై భార్య ఫిర్యాదు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌస్‌నగర్‌కు చెందిన సయ్యద్ సిద్దిఖా అనే మహిళ తన భర్త షేక్ హయ్యత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయరాముడు తెలిపారు. వీరువురు రెండవ వివాహం చేసుకున్నారు. తరువాత ఇటీవల ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.